సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
గురువారం । 22 । ఆగస్టు । 2024



ఎసైన్షియా కంపెనీ వద్ద గుమిగూడిన జనం


పొగలు వ్యాపించిన ఫ్యాక్టరీ భవనం


ఒళ్లంతా గాయాలు


భీతావహ స్థితిలో క్షతగాత్రుడు


తలకు, కళ్లకు గాయాలైన కార్మికుడు


స్ట్రెచర్‌పై క్షతగాత్రుడిని తీసుకెళ్తున్న దృశ్యం


విషాదవదనాలతో క్షతగాత్రుల కుటుంబ సభ్యులు

కాటేసిన కార్ఖానా

కుప్పకూలిన శిథిలాల్లో నలిగిన ప్రాణాలు...
ఎగసిపడుతున్న మంటలు...పొగచూరిన పరిసరాలు
శ్వాస ఆడక.. మాట రాక.. పగిలిన గుండెలు
రసాయన మంటల్లో మసైపోయిన బతుకులు...
తునాతునకలైన దేహాలు...

రక్తాన్ని చెమటగా మార్చే కష్టజీవులు..
యంత్రాలకు చెట్లకు వేలాడే నెత్తుటి ముద్దలై...
అక్కడంతా బీభత్సం...మాటలకందని విషాదం..
ఎవరిది కాలో...ఎవరిది చేయో...తెలియని హృదయ విదారక స్థితిలో..
ముక్కలైన దేహాలను మూటకట్టి విసిరేసిన దుర్మార్గం..

తమ వాళ్లకేమైందో...జాడ తెలియక...బతికున్నారో లేదో అంటూ
లబలబలాడిన గుండెలతో పరిశ్రమ గేటు వద్దకు
పరుగులు తీసిన వారికి సమాధానం చెప్పే నాథుడు లేక...
అంతులేని నిర్లక్ష్యానికి, అనంత శోకానికి నిదర్శనంగా..
సెజ్‌లోని ఎసైన్షియా పరిశ్రమలో బుధవారం జరిగిన ప్రమాదం
పెను విషాదం నింపింది. జిల్లాలో ప్రకంపనలు రేపింది..


గాయపడ్డ ఉద్యోగి


తమవారి ఆచూకీ లేక విలపిస్తున్న మహిళ

పగిలిన గుండెలు.. నెత్తుటి ముద్దలు...

కెమి'కిల్' పరిశ్రమలో కాలిన బతుకులు

సంఘటనల క్రమం

దుర్ఘటన సమయం మధ్యాహ్నం **2.25**	మృతుల తరలింపు మొదలు **5.00**
క్షతగాత్రుల్ని బస్సుల్లో చేర్చింది **3.00**	బంధువుల ఆందోళన రాత్రి **7.00**
అధికారుల రాక **3.30**	కేజీహెచ్‌కు మృతదేహాల తరలింపు **11.00**
అగ్నిమాపక దళం ఆపరేషన్ **4.00**	హోంమంత్రి రాక **12.40**

ఎటు చూసినా మాంసపు ముద్దలే..

- ఎసైన్షియా కంపెనీలో భారీ ప్రమాదం
- పేలుడు ధాటికి చెల్లాచెదురైన కార్మికుల శరీరాలు
- 17 మంది మృతి.. శిథిలాల కింద మరో 9 మంది?
- హృదయ విదారకంగా అచ్యుతాపురం సెజ్‌లో పరిస్థితి
- సహాయక చర్యలు ఆలస్యం
- గంటన్నరైనా రాని అంబులెన్సులు
- కంపెనీ బస్సుల్లోనే క్షతగాత్రుల తరలింపు
- కేజీహెచ్‌కు మూటల్లో మృతదేహాలు

అంతా యువకులే...

ఎసైన్షియా ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదంలో మృత్యువాత పడినవారంతా యువకులే ఉండటం విషాదకరం. వివిధ జిల్లాల నుంచి ఉపాధి కోసం ఇక్కడికి వచ్చారు. నైపుణ్యం లేకపోయినా దాదాపు ఫార్మా కంపెనీల్లోనే ఎక్కువగా ఉపాధి అవకాశాలు దొరుకుతున్నాయి. ఈ కారణంగానే యువకులు ఎక్కువ శాతం మంది ఫార్మా పరిశ్రమల్లో చేరుతున్నారు. ఎసైన్షియా ఫార్మా పరిశ్రమలో దాదాపు 70 శాతం మంది 40 ఏళ్లలోపు యువతే విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ ప్రమాదంలో మృత్యు ఒడికి చేరిన వారిలో ఎక్కువ మంది 40 సంవత్సరాల్లోపు ఉన్న వారే కావడంతో అంతటా విషాద ఛాయలు అలుముకున్నాయి. వీరిలో కొందరికి వివాహం కాలేదని తెలుస్తోంది. మరికొందరికి చిన్న చిన్న పిల్లలున్నట్లు బంధువులు చెబుతున్నారు.

విశాఖ సిటీ/అచ్యుతాపురం/రాంబిల్లి (యలమంచిలి)/అనకాపల్లి/తుమ్మపాల: బుధవారం మధ్యాహ్నం 2.15 గంటలు.. కొంత మంది భోజనానికి వెళ్లారు. మరికొంత మంది వారి పనుల్లో నిమగ్నమయ్యారు. ఒక్కసారిగా అణుబాంబు పేలినట్టు భారీ విస్ఫోటనం.. భూమి కంపించింది.. అచ్యుతాపురం సెజ్ పరిసర ప్రాంతాల్లో ఉన్న వారు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. 500 కిలోల సామర్థ్యం గల రియాక్టర్ పేలడంతో ఆ ధాటికి ఎసైన్షియా అడ్వాన్స్‌డ్ సైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ భవనం కుప్పకూలిపోయింది. దాని నుంచి దట్టమైన పొగ క్షణాల్లోనే కిలోమీటర్ వరకు వ్యాపించింది. ఏం జరిగిందో ఎవరికీ అంతుచిక్కలేదు. ఎసైన్షియా కంపెనీలో రియాక్టర్ పేలడంతో ఆ ప్రాంతం శవాల దిబ్బగా మారింది. పేలుడు ధాటికి కార్మికుల శరీర భాగాలు వందల మీటర్ల వరకు చెల్లాచెదురయ్యాయి. చెట్లపైకి కాళ్లు, చేతులు ఎగిరిపడ్డాయి. మూడో అంతస్తులో రియాక్టర్ పేలడంతో ఆ భవనం నేలమట్టమైంది. కింద అంతస్తులో ఉన్న కార్మికులపై శ్లాబ్ కుప్పకూలడంతో సజీవ సమాధి అయిపోయారు. కొందరి మృతదేహాలు పూర్తిగా చితికిపోయి మాంసపు ముద్దగా మారిపోయాయి. 17మంది దుర్మరణం పాలవ్వగా 40 మందికి పైగా తీవ్ర గాయాలయ్యాయి. దాదాపు పాతికేళ్ల క్రితం హెచ్‌పీసీఎల్ పరిశ్రమలో జరిగిన ప్రమాదం తరువాత అతిపెద్ద పారిశ్రామిక విషాదంగా ఈ దుర్ఘటన నిలవనుంది.


క్షతగాత్రుడిని ఓదారుస్తున్న కుటుంబ సభ్యులు

కొంత ఆలస్యంగా సహాయక చర్యలు

అప్పటి వరకు ప్రశాంతంగా ఉన్న సెజ్.. పేలుడు ఘటనతో ఒక్కసారిగా ఉలిక్కిపడింది. భారీ శబ్దంతో పేలుడు సంభవించడంతో చుట్టుపక్కల కంపెనీల్లో పనిచేసే కార్మికులు భయంతో పరుగులు పెట్టారు. సుమారు 15 నిమిషాల వరకు ఎసైన్షియా కంపెనీ వైపు వెళ్లడానికే భయపడిపోయారు. ఈ క్రమంలో ప్రమాదంలో చిక్కుకున్న కార్మికుల పరిస్థితి దారుణంగా మారింది. అధికారులు రావడానికి కూడా 30 నిమిషాలకు పైగా సమయం పట్టింది. అప్పటి వరకు కనీసం ప్రమాదంలో చిక్కుకున్న క్షతగాత్రులను బయటకు తీసుకువచ్చే పరిస్థితి లేకుండా పోయింది. ముందుగా స్థానిక అధికారులతో పాటు అగ్ని మాపక శాఖ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుంది. ఒకవైపు మంటలను అదుపు చేస్తూనే.. మరోవైపు భవనంపై చిక్కుకున్న వారిని రక్షించే ప్రయత్నం చేశారు. మూడో అంతస్తులో చిక్కుకున్న కార్మికులను క్రేన్ సాయంతో కిందకు దించారు. ప్రమాదం జరిగిన ప్రాంతంలో దట్టమైన పొగలు అలుముకోవడంతో సహాయక చర్యలకు ఎక్కువగా సమయం పట్టింది.


ఫ్యాక్టరీ ముందు కార్మికులు, బంధువులు, స్థానికులు


మృతదేహాల తరలింపును అడ్డుకుంటున్న బంధువులు

మిన్నంటిన రోదనలు

కొద్ది నిమిషాలకు అన్ని శాఖల అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని సహాయ కార్యక్రమాన్ని ముమ్మరం చేశారు. అయితే పేలుడు ధాటికి భవన శకలాలు, ఇతర సామగ్రి ఎగిరి అక్కడ పనిచేస్తున్న కార్మికులకు బలంగా తగలడంతో అనేక మంది గాయపడ్డారు. అలాగే పేలుడు కారణంగా వెలువడిన రసాయనాలు పడి కొందరు క్షతగాత్రులయ్యారు. వీరందరినీ సహాయక బృందాలు బయటకు తీసుకువచ్చాయి. అయితే క్షతగాత్రుల రోదనలతో ఆ ప్రాంతం మార్మోగిపోయింది. ఒకేసారి ఎక్కువ సంఖ్యలో కార్మికులకు గాయాలవడంతో వారిని అక్కడి నుంచి తరలించడానికి అధిక సమయం పట్టింది. దీంతో వారు ఆ గాయాల నొప్పిని భరించలేక చేసిన రోదనలు మిన్నంటాయి.

అంబులెన్సులు లేకపోవడంతో..

ప్రమాదం జరిగిన గంటన్నర అయినా అంబులెన్సులు సంఘటన స్థలానికి చేరుకోకపోవడం గమనార్హం. దీంతో క్షతగాత్రులను కంపెనీ బస్సుల్లోనే ఆస్పత్రులకు తరలించారు. ఆ తరువాత రెండు అంబులెన్సులు వచ్చినప్పటికీ.. అవి సరిపోలేక అనేక మంది తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అక్కడి నుంచి 30, 40 కిలోమీటర్ల మేర ఆ నొప్పితోనే ప్రయాణించాల్సి వచ్చింది.


రక్తసిక్తంగా ఘటనా స్థలం

మృతులు, క్షతగాత్రుల్లో ఉత్తరాంధ్రవారే ఎక్కువ

ఈ ప్రమాదంలో 17 మంది కార్మికులు మృత్యువాత పడ్డారు. వీరిలో భవనం శ్లాబ్ పడి చనిపోయిన వారే ఎక్కువగా ఉన్నారు. శిథిలాల కింద మరో 9 మంది వరకు ఉండే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. కొంతమంది మృతదేహాలు గుర్తించలేని పరిస్థితిలో ఉన్నాయి. సంఘటనా స్థలం నుంచి మృతదేహాలను బయటకు తీయడానికి సహాయ సిబ్బంది తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. అనేక మంది శరీర భాగాలు ఎగిరిపడడంతో వాటిని ఏరుకోవాల్సి వచ్చింది. కొన్ని ఏకంగా ఛిద్రమై మాంసపు ముద్దలా మారిపోయాయి. వాటన్నింటినీ మూటల్లో చుట్టి ఉంచారు. మృతుల్లో ఎక్కువ మంది ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన వారుగా తెలుస్తోంది.

కేజీహెచ్‌కు మాంసపు ముద్దలు

ఘటనా స్థలం నుంచి 13 మృతదేహాలను కేజీహెచ్‌కు తరలించారు. ఇందులో మాంసపు ముద్దలే వచ్చాయి. ఎవరి కాలు, ఎవరి చేయి, ఎవరిది శరీరమో గుర్తించలేని పరిస్థితి ఉంది. శరీర భాగాలను మూటలు కట్టుకొని తీసుకువచ్చారు. హృదయ విదారకరమైన ఈ సంఘటన చూసిన వారంతా చలించిపోయారు.

నేడు సీఎం చంద్రబాబు రాక

సాక్షి, విశాఖపట్నం: ఎసైన్షియా ఫార్మా కంపెనీలో ప్రమాద బాధితులను పరామర్శించేందుకు సీఎం చంద్రబాబునాయుడు గురువారం విశాఖ రానున్నారు. ఉదయం 10.50 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుని అక్కడ నుంచి హెలికాప్టర్‌లో కోస్టల్ బ్యాటరీకి రానున్నారు. అక్కడ నుంచి రోడ్డుమార్గంలో మెడికవర్ హాస్పిటల్‌కు చేరుకొని అక్కడ చికిత్స పొందుతున్న క్షతగాత్రుల్ని పరామర్శించనున్నారు. అనంతరం కోస్టల్ బ్యాటరీకి చేరుకొని హెలికాప్టర్‌లో అచ్యుతాపురం సెజ్‌కి చేరుకుని ప్రమాద స్థలాన్ని పరిశీలించనున్నారు. అనంతరం హెలికాప్టర్‌లో ఎయిర్‌పోర్టుకు చేరుకొని మధ్యాహ్నం 2 గంటలకు విజయవాడ తిరుగు ప్రయాణం కానున్నారు.

మృతుల పేర్లు

1. నీలపు రామిరెడ్డి (49) అసోసియేట్ జనరల్ మేనేజర్/అసోసియేట్ డైరెక్టర్, కొత్త వెంకోజీపాలెం, విశాఖపట్నం
2. హంస ప్రశాంత్ (34) సీనియర్ ఎగ్జిక్యూటివ్, పొందూరు, శ్రీకాకుళం జిల్లా
3. మహంతి నారాయణరావు (34) అసిస్టెంట్ మేనేజర్/టీమ్ లీడర్, అర్తమూరు, గరివిడి, విజయనగరం జిల్లా
4. కొప్పర్తి గణేష్‌కుమార్ (33), సీనియర్ ఎగ్జిక్యూటివ్, జువ్వలదొడ్డి, బిక్కవోలు, తూర్పుగోదావరి జిల్లా
5. చల్లపల్లి హారిక (22), ట్రైనీ ఇంజినీర్, రమణయ్యపేట, కాకినాడ
6. పైడి రాజశేఖర్ (23) ట్రైనీ ప్రాసెస్ ఇంజినీర్, వంజంగి, ఆముదాలవలస మండలం, శ్రీకాకుళం జిల్లా
7. మారిశెట్టి సతీష్ (31) సీనియర్ ఎగ్జిక్యూటివ్, పొసర్లపూడి, తూర్పుగోదావరి జిల్లా
8. మొండి నాగబాబు (36), అసిస్టెంట్ మేనేజర్, సామర్లకోట
9. నాగేశ్వర రామచంద్రరావు (47), అసిస్టెంట్ మేనేజర్/టీమ్ లీడర్, కూర్మన్నపాలెం, విశాఖ
10. వేగి సన్యాసినాయుడు (53) హౌస్ కీపింగ్ బాయ్, అనకాపల్లి
11. ఎల్లబిల్లి చిన్నారావు (27) పెయింటర్, అచ్యుతాపురం, అనకాపల్లి
12. జవ్వాది పార్థసారథి (27) ఫిట్టర్, పార్వతీపురం,
13. పూడి మోహన్‌దుర్గా ప్రసాద్, హౌస్ కీపింగ్ బాయ్ అచ్యుతాపురం
14. జె.చిరంజీవి (25) ఫిట్టర్, ఎస్.రాయవరం, దార్లపూడి
15. బమ్మిడి ఆనందరావు (35), అసిస్టెంట్ మేనేజర్, విజయనగరం, పూసపాటిరేగ
16. మర్ని సురేంద్ర (37), అసిస్టెంట్ మేనేజర్, ఖమ్మం జిల్లా, ఆశ్వారావుపేట
17. పి.వెంకటసాయి(28), సీనియర్ ఎగ్జిక్యూటివ్, అడ్డురోడ్డు, ఎస్.రాయవరం, అనకాపల్లి జిల్లా

మెట్లు ఎక్కుతుండగా ప్రమాదం



రెండో షిఫ్ట్ డ్యూటీలో చేరేందుకు కంపెనీ మెట్లు ఎక్కుతున్నా. అదే సమయంలో ఢాం అని సౌండ్ వచ్చింది. బిల్డింగ్ ఊగిపోయింది. దీంతో నేను కూడా తూలి కింద పడిపోయాను. నా మీద నుంచి రాళ్లు, శ్లాబ్ పెచ్చులు వెళ్లాయి.
– బి.సూరిబాబు, వై.లోవ, రాంబిల్లి

చుట్టూ చెల్లాచెదురు



ఏడాదిగా పనిచేస్తున్నా. నేనుండేది ఇక్కడే సెజ్ కాలనీలో. ఈ రోజు మధ్యాహ్నం డ్యూటీకి వచ్చిన అరగంటలోనే ఈ ప్రమాదం జరిగింది. భయంకరమైన సౌండ్ వచ్చింది. చుట్టూ అంతా చెల్లాచెదురైంది. నా చేతికి, ముఖంపై గాయాలయ్యాయి. భయంతో తోచిన వైపు పరుగులు తీశా.
– జె.వర్ధన్, హెల్పర్

ఎవరూ పట్టించుకోవట్లేదు



మాది గాజువాకలోని శ్రీనగర్. బి షిఫ్ట్ విధుల్లోకి వచ్చా. ఆఫీస్‌కు వచ్చిన వెంటనే ప్రమాదం జరిగింది. చేతికి గాజు పెంకులు గుచ్చుకున్నాయి. ఆస్పత్రిలో చేర్చి గంటలు గడిచినా ఒక్క డాక్టరూ వచ్చి చూడలేదు. అడిగినా ఎవరూ పట్టించుకోవట్లేదు.
– సీహెచ్ బంగారునాయుడు, కెమిస్ట్

ఇక్కడ చేరి రెండు నెలలే..



ఉద్యోగం కోసం శ్రీకాకుళం నుంచి 2 నెలల క్రితం రాంబిల్లి వచ్చాను. కంపెనీలో ప్రొడక్షన్ విభాగంలో పనిచేస్తున్నా. మధ్యాహ్నం ఒక్కసారిగా పెద్ద శబ్దం వచ్చింది. వెనక్కి తిరిగి చూసేసరికి ఏమీ కనిపించలేదు. అంతా పొగతో, మంటల్లో కాలిపోతోంది. నాకు ముఖం, చేతిపైన కాలిపోయింది.
– కె.రాంబాబు, క్షతగాత్రుడు

కేజీహెచ్‌కు మృతదేహాలు


మృతదేహాలను మూటకట్టి తీసుకువస్తున్న సిబ్బంది


అంబులెన్సుల్లో మృతదేహాల తరలింపు


కేజీహెచ్‌లో పర్యవేక్షిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట(విశాఖ): ఎసైన్షియా ఫార్మా కంపెనీ ప్రమాదంలో మరణించిన 13 మంది ఉద్యోగుల మృతదేహాలను బుధవారం రాత్రి కేజీహెచ్‌కు మార్చురీకి తీసుకొచ్చారు. మృతదేహాలు గుర్తుపట్టలేని విధంగా ఉన్నాయి. విశాఖ కలెక్టర్ హరేందిర ప్రసాద్, డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు, కేజీహెచ్ సూపరింటెండెంట్ శివానంద్, ఏఎంసీ ప్రిన్సిపాల్ బుచ్చిరాజు, విశాఖ ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, సీతమ్మధార తహసీల్దార్ రమేష్ స్వయంగా పర్యవేక్షించారు. పలువురు క్షతగాత్రులను సెవెన్ హిల్స్, మెడికవర్ ఆస్పత్రికి తరలించారు.

కేజీహెచ్‌కు తీసుకొచ్చిన మృతదేహాలు
నీలపు రామిరెడ్డి, మహంతి నారాయణరావు, మొండి నాగబాబు, చల్లపల్లి హారిక, మారిశెట్టి సతీష్, యల్లబిల్లి చిన్నారావు, పైడి రాజశేఖర్, మోహనరావు, బొడ్డు నాగేశ్వర రామచంద్రరావు మృతదేహాలను తీసుకొచ్చారు. నాలుగు మృతదేహాల వివరాలు తెలియలేదు.


కేజీహెచ్‌లో మృతదేహాలు


కేజీహెచ్ మార్చురీకి చేరిన మృతదేహాలు



మార్చురీ వద్ద కుటుంబ సభ్యుల ఆందోళన

మహారాణిపేట : తమకు న్యాయం చేయాలని మృతుల కుటుంబ సభ్యులు, వారి బంధువులు కేజీహెచ్ మార్చురీ వద్ద బుధవారం రాత్రి ఆందోళనకు దిగారు. వెంటనే నష్టపరిహారం ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఇప్పటివరకు ప్రభుత్వం తరఫున, యాజమాన్యం తరఫున కనీస స్పందన లేకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. పంచనామాకు సంతకాలు పెట్టేదిలేదని భీష్మించుకుకూర్చున్నారు. సీఎం చంద్రబాబు గురువారం విశాఖ పర్యటనలో పరిహారం ప్రకటిస్తారని సంతకాలు చేయాలని అధికారులు కోరినా వారు వినలేదు. తమకు న్యాయం చేయకుండా పంచానామా చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

క్లుప్తంగా

పోలీసు ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోండి

ముంచంగిపుట్టు: పోలీసుశాఖలో ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ విడుదల అయినందున ఉద్యోగాలకు గిరిజన యువతీ,యువకులు దరఖాస్తు చేసుకోవాలని ఎస్ఐ రవీంద్ర కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ పోలీసుశాఖలో సీఐఎస్ఎఫ్, సీఆర్‌పీఎఫ్, బీఎస్ఎఫ్, ఏఆర్, ఎస్ఎస్‌బీ, ఐటీబీపీ ఉద్యోగాలకు టెన్త్ పాసైన 18 నుంచి 23 సంవత్సరాల వయసు గల గిరిజన యువతీ, యువకులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ఈ నెల 27న ప్రారంభమై వచ్చే నెల 27తో ముగుస్తుందని అన్నారు. అర్హులైన అభ్యర్థులందరికీ స్ఫూర్తి కార్యక్రమం ద్వారా ఐటీడీఏ, పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఉచిత వసతి, భోజనంతో పాటు శిక్షణ ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు స్థానిక పోలీసుస్టేషన్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

కోలుకుంటున్న విద్యార్థులు

మహారాణిపేట: కోటవురట్ల మండలం కైలాసపట్నంలో కలుషిత ఆహారం ఘటనలో తీవ్ర అస్వస్థతకు గురైన విద్యార్థులు కోలుకుంటున్నారు. కేజీహెచ్ పిల్లల వార్డులో 38 మంది చికిత్స పొందుతున్నారు. వీరికి సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ పర్యవేక్షణలో పిల్లల విభాగాధిపతి డాక్టర్ చక్రవర్తి, ఇతర వైద్యులు సేవలు అందిస్తున్నారు. నలుగురు విద్యార్థులను నగరంలో పలు ప్రైవేటు ఆస్పత్రులకు తరలించారు. 14 మంది కేజీహెచ్ పిల్లల వార్డు ఐసీయూలో చికిత్స పొందుతున్నారు. పిల్లలందరూ కోలుకుంటున్నారని సూపరింటెంటెంట్ డాక్టర్ పి.శివానంద్ తెలిపారు.

ముమ్మరంగా తనిఖీలు



డ్రోన్‌ల సాయంతో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

పాడేరు : గంజాయి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. ఎస్పీ అమిత్‌బర్దర్ ఆదేశాల మేరకు పాడేరు–చోడవరం ప్రధాన రహదారి మినుములూరు వద్ద స్థానిక పోలీసులు డ్రోన్ సాయంతో తనిఖీ చేశారు. ఈ మార్గంలో రాకపోకలు సాగించే ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి విడిచిపెట్టారు.

వైఎస్ జయమ్మ ట్రస్ట్ సేవలు ఆదర్శనీయం

- క్యాన్సర్ నిర్ధారితులకు పూర్తిస్థాయి వైద్యం
- హోమిబాబా క్యాన్సర్ ఆస్పత్రి రీసెర్చ్ సెంటర్‌లో చికిత్స
- కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్
- జిల్లా సర్వజన ఆస్పత్రిలో ట్రస్ట్ వైద్య బృందాలకు అభినందన





మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్, కలెక్టర్‌కు మెమెంటో అందజేస్తున్న ట్రస్ట్ ప్రతినిధి వైఎస్ రవీంద్రనాథ్‌రెడ్డి

సాక్షి,పాడేరు: జిల్లాలో వైఎస్ జయమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్క్రీనింగ్ పరీక్షల ద్వారా నిర్ధారించిన క్యాన్సర్ రోగులకు విశాఖపట్నం హోమి బాబా క్యాన్సర్ ఆస్పత్రి, రీసెర్చ్ సెంటర్‌లో వైద్యం అందిస్తామని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ తెలిపారు. వైఎస్ జయమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో హైదరాబాద్ గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ సహకారంతో పాడేరు డివిజన్‌లో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక జిల్లా సర్వజన ఆస్పత్రిలో బుధవారం నిర్వహించిన సభలో ట్రస్ట్ వైద్య బృందాలను అభినందించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ వైఎస్ జయమ్మ మెమోరియల్ ట్రస్ట్, గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ సంస్థలు గిరిజన ప్రాంతాల్లో చేపట్టిన సేవా కార్యక్రమాలు ఆదర్శనీయమన్నారు. వీరిని మిగతా స్వచ్ఛంద సంస్థలు ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ఇప్పటివరకు పాడేరు డివిజన్‌లో అన్ని పీహెచ్‌సీల పరిధిలో 61 క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరాలను విజయవంతంగా నిర్వహించారన్నారు. దీనిలో భాగంగా మహిళలు 5,274 మంది, పురుషులు 2,324 మంది మొత్తం 7,598 మందికి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు జరిపారని తెలిపారు. అందులో 1,785 మందికి మ్యామోగ్రాం పరీక్షలు, 2,310 మందికి ప్యాప్ స్మియర్ పరీక్షలు నిర్వహించారన్నారు. క్యాన్సర్ అనుమానితులుగా గుర్తించిన 26 మందికి బయాప్సి చేయాల్సి ఉందన్నారు. మరో 145 మందిని అల్ట్రా సౌండ్ స్కానింగ్‌కు రిఫర్ చేశామన్నారు. ఈ పరీక్షలలో 122 మందికి డయాబెటిస్, 172మందికి హైపర్ టెన్సన్, 16మందికి గ్లాకోమా ఉన్నట్టు నిర్ధారించారని తెలిపారు. పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ మాట్లాడుతూ చింతపల్లి మండలం కోరుకొండలో ఈనెల 22న, చింతపల్లి ఏరియా ఆస్పత్రిలో ఈనెల 23న జరిగే క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నూరుశాతం క్యాన్సర్ నయమే లక్ష్యం : వైఎస్ జయమ్మ ట్రస్ట్ ప్రతినిధి రవీంద్రనాథ్‌రెడ్డి

క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షల ద్వారా గర్భాశయ, నోటి క్యాన్సర్లను ప్రారంభ దశలోనే గుర్తించి నూరుశాతం క్యాన్సర్ నివారణ ప్రధాన లక్ష్యంగా కృషి చేస్తున్నామని వైఎస్ జయమ్మ ట్రస్ట్ ప్రతినిధి వైఎస్ రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. స్క్రీనింగ్ పరీక్షలు విజయవంతానికి అన్నివిధాలుగా సహకరిస్తున్న కలెక్టర్, ఐటీడీఏ పీవో, వైద్యులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే కలెక్టర్, ఐటీడీఏ పీవో, ఇతర అధికారులకు రవీంద్రనాథ్‌రెడ్డి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హేమలతాదేవి, ఆస్పత్రి పర్యవేక్షకులు డాక్టర్ విశ్వామిత్ర, డీసీహెచ్ఎస్ డాక్టర్ కృష్ణారావు, పలువురు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

అనధికార వసతి గృహాలపై చర్యలు



జిల్లా ఆస్పత్రిలో కోలుకుంటున్న విద్యార్థులను పరామర్శిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, పీవో అభిషేక్

- నిలకడగా బాధిత విద్యార్థుల ఆరోగ్యం
- కలెక్టర్ దినేష్‌కుమార్

సాక్షి,పాడేరు: అనధికారికంగా నిర్వహిస్తున్న వసతి గృహాలపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ హెచ్చరించారు. బుధవారం ఆయన స్థానిక జిల్లా సర్వజన ఆస్పత్రిని సందర్శించారు. కలుషిత ఆహారం వల్ల తీవ్ర అస్వస్థతకు గురై చికిత్స పొందుతున్న ఎనిమిది మంది విద్యార్థులను కలెక్టర్ పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు.వారి సంరక్షులతో మాట్లాడారు.గిరిజన సంక్షేమ హాస్టళ్లు ఉండగా, అనుమతులు లేని వసతి గృహాల్లో చేర్పించడానికి కారణాలను కలెక్టర్ తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కైలాసపట్నం మిషనరీ వసతి గృహంలో కలుషిత ఆహారం తిని విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురైన ఘటనలో ముగ్గురు మృతి చెందడం బాధాకరమన్నారు. మిగతా విద్యార్థుల్లో పరిస్థితి నలుగురు కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యసేవలు పొందుతున్నారని ఆయన తెలిపారు. పాడేరు ఆస్పత్రిలో ఎనిమిది మంది విద్యార్థులను గురువారం డిశ్చార్జి చేస్తారన్నారు. చింతపల్లి,రంపచోడవరం మండలాల్లో అనధికారికంగా నిర్వహిస్తున్న వసతి గృహాలపై తగిన చర్యలు తీసుకుంటామన్నారు. అనధికారికంగా వసతి గృహాలు నిర్వహిస్తున్న వారు వెంటనే పిల్లలను అప్పగించాలని లేని పక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీవో అభిషేక్,డీఎంహెచ్‌వో జమాల్‌బాషా,మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హేమలతాదేవి, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విశ్వామిత్ర, డీసీహెచ్ఎస్ డాక్టర్ కృష్ణారావు పాల్గొన్నారు.

జాబ్‌కార్డుదారులందరికీ ఉపాధి పనులు

సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్



ప్రజావేదికలో పాల్గొన్న రంపచోడవరం సబ్‌కలెక్టర్ ప్రశాంత్ కుమార్ తదితరులు

గంగవరం : జాబ్‌కార్డు గల ప్రతి ఒక్కరికీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పించేందుకు అధికారులు , సిబ్బంది కృషి చేయాలని రంపచోడవరం సబ్‌కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక ఉపాధి హామీ పథకం కార్యాలయం ఆవరణలో సామాజక తనిఖీ నివేదిక ప్రజా వేదిక సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సమావేశాన్ని రంపచోడవరం సబ్‌కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ పరిశీలించారు. ఉపాధి హామీ పనుల అమలపై చర్చించారు. సామాజక తనిఖీ బృందాలు క్షేత్ర స్థాయిలో గుర్తించి అంశాలపై సబ్‌కలెక్టర్ ఆరా తీశారు. రికార్డులను తనిఖీ చేశారు. గ్రామ పంచాయతీల వారీగా సామాజక తనిఖీ నివేదికలను ఆయన పరిశీలించారు. ఉపాధి హామీ పనులు అమల్లో నిర్లక్ష్యం, అలసత్వం వహిస్తే సహించేది లేదని, పొరపాట్లుకు తావులేకుండా పనులు అమలు చేయాలని ఉపాధి అధికారులను, సిబ్బందిని సబ్‌కలెక్టర్ ఆదేశించారు. ప్రతీ కుటుంబం వంద రోజులు పని దినాలు పూర్తి చేసే విధంగా వారిని ప్రోత్సాహించాలన్నారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో అమలు జరిగిన ఉపాధి పనులపై సోషల్ ఆడిట్ బృందాలు ఈ నెల 20వ తేదీ వరకు గ్రామాల్లో తనిఖీలు నిర్వహించినట్టు ఎంపీడీవో బి.శ్రీనివాసులు తెలిపారు. సోషల్ ఆడిట్ బృందాలు గుర్తించిన అంశాలను చర్చించినట్టు ఎంపీడీఓ వివరించారు. జిల్లా విజలెన్స్ అధికారి విజయలక్ష్మి, ఏపీడీ ఎల్.రాంబాబు, ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ బేబీరత్నం, ఎంపీడీఓ బి.శ్రీనివాసులు, ఉపాధి ఏపీఓ ప్రకాశ్, స్థానిక సర్పంచ్ కలుముల అక్కమ్మ , ఉపాధి హామీ సిబ్బంది, సోషల్ ఆడిట్ బృందాలు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



పంట కాలువలోకి దూసుకుపోయిన లారీ

పాడేరు : సిమెంట్ లోడుతో పాడేరు వస్తున్న లారీకి బ్రేకులు ఫెయిల్ కావడంతో పంట కాలువలోకి దూసుకుపోయింది. మైదాన ప్రాంతం నుంచి సిమెంట్ బస్తాల లోడుతో వస్తున్న లారీ బుధవారం ఉదయం పాడేరు–చోడవరం ప్రధాన రహదారిలోని ముమ్ములూరు మలుపు వద్ద బ్రేకులు ఫెయిల్ కావడంతో వెనక వైపు వచ్చేసింది. రహదారి పక్కనే ఉన్న పంట కాలువలో లారీ సగం వరకు దూసుకుపోయింది. త్రుటిలో ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ సహా ఎవ్వరికి ఎటువంటి గాయాలు కాలేదు.

ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిలువుటద్దం కోటవురట్ల ఘటన

ఆదివాసీ గిరిజన సంఘం విమర్శ



కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న చిన్నారులను పరామర్శిస్తున్న ఆదివాసీ గిరిజన సంఘ ప్రతినిధులు

మహారాణిపేట : ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల కోటవురట్ల ట్రస్టులో ఆదివాసీ చిన్నారులు మృత్తి చెందారని, ఈ సంఘటనపై జ్యుడీషియల్ విచారణ చేపట్టాలని ఆదివాసీ గిరిజన సంఘం విశాఖ జిల్లా కమిటీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి కిముడు చిన్నంనాయుడు, గసాడి వెంకట రమణమూర్తి కోరారు. విషాహారం తిని అస్వస్థతకు గురై విశాఖ కేజీహెచ్ పిల్లల వార్డులో చికిత్స పొందుతున్న వారిని ఆదివాసీ గిరిజన సంఘం నాయకుల బృందం బుధవారం పరామర్శించింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఈ విద్యార్థులను దత్తత తీసుకుని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి విద్య అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు పి.అప్పల నరస, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సురేంద్ర, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.చిన్నంనాయుడు, ఏయూ గిరిజన ఉద్యోగ సంఘం నాయకులు సింహాద్రి, సత్యనారాయణ, కోటిబాబు తదితరులు పిల్లలను పరామర్శించి గిరిజన బాలలకు అందుతున్న వైద్య సేవలపైన, మృతి చెందిన విద్యార్థుల వివరాలు, అస్వస్థతకు గల కారణాలు, విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఐ.కొండలరావు నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గత 13 సంవత్సరాలుగా ఎటువంటి అనుమతి లేకుండా కోటవురట్ల మండలం కైలాసపట్నంలో అనాథాశ్రమం నడుపుతుంటే అధికారుల పర్యవేక్షణ లేకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శమన్నారు. ఎంతో మంది ఏజెన్సీ విద్యార్థులు నర్సీపట్నం, ఎస్.కోట, చోడవరం, మాడుగుల నుంచి వచ్చి చదువుకుంటున్నారని అన్నారు. వీరికి పీవీటీజీ గురుకులంలో ప్రత్యేక అడ్మిషన్లు ఇవ్వాలని అల్లూరి జిల్లా కలెక్టర్‌ను కోరారు.

బాల్యవివాహాల అనర్థాలపై విస్తృత ప్రచారం

చింతూరు: బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై గ్రామస్థాయిలో విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య సూచించారు. బాల్య వివాహాల నిర్మూలన కమిటీ డివిజన్ సమావేశం బుధవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలు, పాఠశాలలు వెళ్లే ఆడపిల్లలను మోసం చేయకుండా పోలీసుశాఖ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని తెలిపారు. వెలుగు, ఐసీడీఎస్, ఆరోగ్యశాఖలు సంయుక్తంగా మండల, గ్రామస్థాయిలో సమావేశాలు నిర్వహించి బాల్య వివాహాల వల్ల కలిగే దుష్ప్రభావాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో సుజాత, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పుల్లయ్య, సీడీపీవో విజయగౌరి, మతపెద్దలు పాల్గొన్నారు.

పలువురి ఎస్ఐలకు స్థాన చలనం

పాడేరు : జిల్లాలోని పలుచోట్ల ఎస్ఐలకు బదిలీ అయింది. పాడేరు పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ జి. లక్ష్మణ్‌రావును శ్రీకాకుళం జిల్లా లావేరి పోలీస్ స్టేషన్‌కు, జిల్లా పోలీస్ శాఖ కార్యాలయంలో డీఎస్‌బీలో పని చేస్తున్న చింతలపూడి దుర్గప్రసాద్‌రావును శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట పోలీస్ స్టేషన్‌కు బదిలీ జరిగింది. డీఎస్‌బీలో పనిచేస్తున్న గర్భాపు రంజిత్‌ను శ్రీకాకుళం జిల్లా పోలాకి పోలీస్‌స్టేషన్‌కు, అరకు స్టేషన్‌లో పనిచేస్తున్న రేగాటి సంతోష్‌ను శ్రీకాకుళం జిల్లా శ్రీకాకుళం 2వ పట్టణ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ–1గా బదిలీ చేశారు. ఈ మేరకు విశాఖ రేంజ్ డీఐజీ ఉత్తర్వుల జారీ చేశారు. బదిలీ అయిన వారి స్థానాల్లో ఇంకా ఎవరిని నియమించలేదు.

ద్విచక్ర వాహనం దగ్ధం



మంటలను ఆర్పుతున్న స్థానికులు

అనంతగిరి (అరకులోయ రూరల్): మంటలు చెలరేగడంతో ద్విచక్ర వాహనం దగ్ధమైంది. మండలంలోని రొంపల్లికి గ్రామానికి చెందిన సారా అప్పాలస్వామి బుధవారం కాశీపట్నం లోని వారపు సంతకు వచ్చాడు. తిరుగు ప్రయాణంలో స్థానికంగా విక్రయించే పెట్రోల్‌ను ట్యాంక్‌లో వేస్తుండగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో పరిసర ప్రాంతీయులు భయాందోళనకు గురయ్యారు. అక్కడ ఉన్న కొంతమంది సహాయంతో నీళ్లు పోసి మంటలను అదుపులోకి తెచ్చారు.

ఘనంగా కజారి తేజ్ పండగ



ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయం వద్ద వివిధ రాష్ట్రాల మహిళలు

సాక్షి,పాడేరు: హిందూ సంస్కృతీ సంప్రదాయాలు ప్రతిబింబించేలా కచారి తేజ్ పండగను స్థానిక ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. వివిధ వ్యాపారాల నిమిత్తం పట్టణంలో నివసిస్తున్న రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్‌కు చెందిన మహిళలు ఆలయంలో వేపచెట్టుకు తాళ్లు కట్టి పూజించారు. అందరూ ఆరోగ్యంగా, సంతోషంగా ఉండాలని వారంతా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉయ్యాల ఊగుతూ పాటలు పాడి సందడి చేశారు.

ద్విచక్ర వాహనం అపహరణపై ఫిర్యాదు

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో మంగళవారం రాత్రి తన ద్విచక్ర వాహనం అపహరణకు గురైందని బాధితుడు బాకూరి యుగంధర్‌రాజు బుధవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మండల కేంద్రం ముంచంగిపుట్టులోని ఇందిరాకాలనీలో ఇంటిని అద్దెకు తీసుకొని ఉంటున్నానని, మంగళవారం రాత్రి ఇంటి వద్ద పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనం ఉదయం నుంచి కనిపించలేదన్నారు. వెతికినూ ఆచూకీ లభ్యం కానందున పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు.

రెవెన్యూశాఖలో 14 మంది పదోన్నతులు రద్దు

చింతూరు: రంపచోడవరం, చింతూరు డివిజన్లలో సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతులు పొందిన 14 మందిని తిరిగి గ్రేడ్–1 వీఆర్వోలుగా రివర్షన్ చేస్తూ తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ రెండు రోజుల క్రితం ఉత్తర్వులు జారీచేశారు. రంపచోడవరం, చింతూరు డివిజన్లోని రెవెన్యూ కార్యాలయాలతో పాటు పోలవరం కార్యాలయం చింతూరు, కూనవరం యూనిట్లలో పనిచేస్తున్న 14 మంది గ్రేడ్–1 వీఆర్వోలకు రెండేళ్ల క్రితం సీనియర్ అసిస్టెంట్లుగా షరతులతో కూడిన పదోన్నతులు ఇచ్చారు. వీరంతా రెండేళ్లలోపు ప్రభుత్వం నిర్వహించే డిపార్ట్‌మెంటల్ పరీక్ష రాసి ఉత్తీర్ణులు అవ్వాల్సి ఉంది. అయితే రెండేళ్లు పూర్తయినా వారు ఉత్తీర్ణులు కాలేదు. దీంతో ప్రభుత్వ నిబంధనల ప్రకారం సదరు 14 మంది పదోన్నతులు రద్దుచేసి తిరిగి గ్రేడ్–1 వీఆర్వోలుగా రివర్షన్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు.

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు



ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిని పరిశీలిస్తున్న డీటీ సత్యనారాయణ

రాజవొమ్మంగి: మండలంలోని దూసరపాము గ్రామ శివారులో కింద్ర జంక్షన్ వద్ద జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న చెరువుగట్టును గుర్తు తెలియని వ్యక్తులు ఆక్రమించారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక డిప్యూటీ తహసీల్దార్ అల్లు సత్యనారాయణ సిబ్బందితో మంగళవారం సాయంత్రం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. అక్కడ ఏర్పాటు చేసిన సిమెంటు స్తంభాలను తొలగించారు. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే ఎంతటి వారైనా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

కేకే లైన్‌లో రైళ్ల గమ్యం కుదింపు

తాటిచెట్లపాలెం: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున వర్షాలు నేపథ్యంలో కేకే లైన్ మార్గంలో నడిచే పలు రైళ్లు ఆయా తేదీల్లో దంతేవాడ వరకే రాకపోకలు సాగిస్తాయని వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. విశాఖపట్నం–కిరండూల్(08551) పాసింజర్ స్పెషల్ ఈనెల 22 నుంచి 28వ తేదీ వరకు, తిరుగు ప్రయాణంలో కిరండూల్–విశాఖపట్నం(08552) పాసింజర్ స్పెషల్ ఈనెల 23 నుంచి 29వ తేదీ వరకు దంతేవాడ వరకు మాత్రమే రాకపోకలు సాగిస్తాయి. విశాఖపట్నం–కిరండూల్(18514) నైట్ ఎక్స్‌ప్రెస్ ఈనెల 22 నుంచి 28వ తేదీ వరకు, తిరుగు ప్రయాణంలో కిరండూల్–విశాఖపట్నం (18513) ఎక్స్‌ప్రెస్ ఈనెల 23 నుంచి 29వ తేదీ వరకు దంతేవాడ వరకు మాత్రమే రాకపోకలు సాగిస్తాయి. ఈ తేదీల మధ్య దంతేవాడ–కిరండూల్ మధ్య ఈ రైళ్లు రాకపోకలు సాగించవు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

- ప్రభుత్వానికి మద్యం దుకాణాల ఉద్యోగుల మొర
- ముంచంగిపుట్టులో ప్లకార్డులతో ప్రదర్శన



ముంచంగిపుట్టులో ప్ల కార్డులతో నిరసన తెలుపుతున్న మద్యం దుకాణాల ఉద్యోగులు

ముంచంగిపుట్టు: మా కుటుంబాలను రోడ్డున పడేయొద్దు.. ఉద్యోగ భద్రత కల్పించాలంటూ బుధవారం మండల కేంద్రంలో మద్యం దుకాణాల ఉద్యోగులు ప్లకార్డులతో ప్రదర్శన నిర్వహించారు.ఈ సందర్భంగా సూపర్‌వైజర్ ఆర్. రాంబాబు,సేల్స్‌మెన్లు ధనార్జున, కృష్ణచైతన్యదొర, మల్లేష్, వాచ్‌మెన్లు చంద్రశేఖర్, పూర్ణ చంద్రరావు మాట్లాడుతూ 2019లో అప్పటి ప్రభుత్వం ప్రైవేట్ మద్యం దుకాణాలను రద్దు చేసి సొంతంగా మద్యం దుకాణాలను ఏర్పాటు చేసిందన్నారు.అర్హతకు అనుగుణంగా ఉద్యోగులను నియమించిందని వివరించారు. ప్రస్తుతం ప్రభుత్వం వీటిని రద్దు చేసి పాత విధానంలో ప్రైవేట్ వ్యక్తులకు టెండర్ల ద్వారా ఇచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇలా చేయడం వల్ల తామంతా రోడ్డున పడే అవకాశం ఉందని, ప్రభుత్వం పునరాలోచన చేసి విద్యార్హత, సీనియారిటీని పరిగణనలోకి తీసుకుని మరో డిపార్టుమెంట్‌లో ఉద్యోగం కల్పించాలని వారు కోరారు.

అసంపూర్తి గృహాల వివరాలు సేకరణ



అసంపూర్తిగా ఉన్న గృహ నిర్మాణాల వివరాలు సేకరిస్తున్న హౌసింగ్ అధికారులు

రాజవొమ్మంగి: ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని ప్రభుత్వ గృహాల నిర్మాణ పరిస్థితులను పరిశీలిస్తున్నట్టు హౌసింగ్ ఏఈ శ్రీనివాస్ చెప్పారు. మండలంలోని 2016 నుంచి 2020 వరకు అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో మండలానికి 445 ఎన్టీఆర్, రూరల్ గృహ నిర్మాణాలు మంజూరు కాగా వీటిలో చాలా వరకు రూఫ్ లెవెల్, లింటల్ లెవెల్, కొన్ని పునాది దశలో నిలిచిపోయినట్టు గుర్తించామని, దీనిపై పూర్తిస్థాయిలో వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదించనున్నట్టు చెప్పారు. ఎన్నో ఏళ్లుగా బిల్లులు మంజూరు కాక అసంపూర్తిగా ఉన్న గృహ నిర్మాణాలపై వివరాల సేకరణ వేగవంతంగా జరుగుతుందన్నారు. కాగా ఈ సారి అయినా అసంపూర్తి గృహ నిర్మాణాలకు బిల్లులు మంజూరు అవుతాయా, తమ ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకోగలమా అని లబ్ధిదారులు ఆశగా ఎదురు చూస్తున్నారు. హౌసింగ్ అధికారులతో పాటు సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఈ తనిఖీల్లో పాల్గొన్నారు.

రెండు వాహనాలు ఢీ: ముగ్గురికి తీవ్ర గాయాలు



గాయపడిన సత్తిబాబు, సాయి

చింతపల్లి: మండలంలోని అంతర్ల వద్ద బుధవారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. సంఘటనపై స్థానికులు అందించిన వివరాలు.. గూడెం కొత్తవీధి నుంచి చింతపల్లి.. చింతపల్లి నుంచి గూడెం వెళ్తుండగా ఎదురెదురుగా వస్తున్న వాహనాలు అంతర్ల గ్రామం వద్ద ఢీకొన్నాయి.ఈ ప్రమాదంలో చౌడుపల్లికి చెందిన కిలో సాయి, కొర్రా సత్తిబాబు, వీరబాబుకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను చింతపల్లి ఆస్పత్రికి స్థానికులు తరలించారు. ప్రమాదంలో ఒకరికి తలపై తీవ్ర గాయం కావడంతో పరిస్థితి తీవ్రంగా ఉండడంతో స్థానిక వైద్యులు పద్మావతి చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై సమాచారం తెలియలేదని పోలీసులు చెప్పారు.

రిజర్వాయర్ కాలువలో పడి వ్యక్తి మృతి



వీరబాబు మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ

గంగవరం : చిన్నంపాలెం సమీపంలోని సూరంపాలెం రిజర్వాయర్ ప్రధాన కాలువలో ప్రమాదవశాత్తుపడి వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. అడ్డతీగల మండలం కోనలోవ గ్రామానికి చెందిన కొరసాల వీర బాబు (32)అనే వ్యక్తి చిన్నంపాలెం గ్రామ శివారులో ఉన్న దుంప తోటలో పనిచేశాడు. మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో దగ్గరలో ఉన్న సూరంపాలెం ప్రాజెక్టు కాలువ వద్దకు స్నానానికి వెళ్లాడు. అక్కడ ప్రమాదవశాత్తూ కాలువలో పడి మృతి చెందినట్టు ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అడ్డతీగల ప్రభుత్వాసుపత్రికి తరలిరచినట్టు ఆయన చెప్పారు.